పూర్తి అయిపోతాయి, అదనంగా వచ్చే లాభం ఏమిటి అంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది.

శ్రద్ధ లేకుండా మనకు జ్ఞానం కలుగదు. సత్పురుషుల సహవాసం వలన, ఆహార నియమంవలన, ఈశ్వరుని పాదాలయందు భక్తి కలిగి ఉండటం వలన మనకు శ్రద్ధ కలుగుతుంది. ఏ రోజున మన శరీరం పోతుందో చెప్పలేము అందుచేత మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. మనకు నేను అనే తలంపు ఉంది. ఆ నేనును ఎవరైనా భంగం చేసారు అనుకోండి వెంటనే వారికి దూరమయిపోతాము. నేను ఏదో పార్టీలో పనిచేస్తున్నాను అనుకోండి. నాకు ఏదీ పదవి ఇవ్వరు అనుకోండి వెంటనే ఆ పార్టీ వదిలేస్తాను అంటే అక్కడ పార్టీ ముఖ్యం కాదు, దేశం ముఖ్యంకాదు, ఈ నేను ముఖ్యం. మొత్తం ఈ సృష్టి అంతా కూడా నేను అనే ఒంటిస్థంభం మీద ఆధారపడి ఉంది. భగవాన్ ఏమని చెప్పారు అంటే ఈ నేను ఉంటే అంతా ఉంది నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, దేవుడు ఉన్నాడు, పుణ్యం ఉంది, పాపం ఉంది, లోకాలు ఉన్నాయి, ధర్మం ఉంది, అధర్మం ఉంది, జన్మలు ఉన్నాయి అన్నీ ఉన్నాయి, ఈ నేను లేకపోతే ఏదీలేదు, ఉన్నది ఒక్కటే. ఎంత వండర్‌ఫుల్‌గా ఉందో చూడండి. దేవుడు ఉన్నాడా, లేడా అన్నది సమస్య కాదు. ఉన్నదేదో ఉంది. ఆ ఉన్నదానిని నీవు కనిపెట్టటం ఎందుకు? ఆ ఉన్నదానిని నీవు ఎరుకలోనికి తెచ్చుకోవటమే. ఇప్పుడు నీవు శరీరంతో, మనస్సుతో ఎలా తాదాత్మ్యం పొందుతున్నావో అలాగ ఉన్నవస్తువుతో తాదాత్మ్యం పొందటమే, ఉన్నదానిని ఉన్నట్లుగా గుర్తించటమే ట్రూత్ రియలైజేషన్. సుఖం కోసం మీరు బజారులో వెదకవద్దు. ఈశ్వరుడిని ప్రేమించండి. ఈశ్వరుడిని ప్రేమించగా ప్రేమించగా ఆయనే మీకు సుఖ స్వరూపంగా వ్యక్తమవుతాడు. ఈశ్వరుడిని ప్రేమించండి అంతకంటే మీరు ఎక్కువ కష్టపడనక్కరలేదు. కర్మఫలం పట్ల ఎక్కువ ఆసక్తి ఉన్నవారికి భగవంతుడు చెప్పిన మాటలు చేదుగా ఉంటాయి, నోటిలో ఆముదం పోసుకొన్నట్లుగా ఉంటుంది. మనస్సు చల్లబడకుండా దానికి లోచూపు రాదు, దానికి లోచూపు వస్తేగాని ఆత్మజ్ఞానం రాదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-11-2007, జువ్వలపాలెం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ముఖ్యంగా విష్ణువును, శివుడును ఆరాధిస్తూ ఉంటాము. విష్ణువు మోక్షాన్ని ఇస్తాడని, శివుడు జ్ఞానాన్ని ఇస్తాడని మన పురాణాలు చెబుతున్నాయి. మోక్షం అన్నా, ఆత్మజ్ఞానం అన్నా ఒక్కటే. మోక్షం అనే శబ్దానికి అర్థం ఏమిటి అంటే విడుదల, విడుదల అంటే దేహంలో నుండి విడుదల కాదు, దేహబుద్ధిలో నుండి దేహము నేను అనే తలంపులో నుండి విడుదల.

జీవితం అంతా తలంపులే. అన్ని తలంపులు దేహము నేను అనే తలంపులో నుండి వస్తున్నాయి. గాఢనిద్రలో మనకు ఈ తలంపుల గొడవ లేదు, అన్ని తలంపులలో నుండి విడిపోతున్నాము. గాఢనిద్రలో దేహములోనుండి, మనస్సులోనుండి, అన్ని తలంపులలోనుండి ఎలా విడిపోతున్నావో అలాగ జాగ్రదవస్థలో విడిపోతే అదే ఆత్మజ్ఞానం, అదే మోక్షం. ఏవో కబుర్లు చెప్పటం వలన ఇది సాధ్యం కాదు. ఒక చెట్టు చావాలంటే వేరుతో సహా లాగితేనే గాని అది నశించదు. అలాగే దేహము నేను అనే తలంపును వేరుతో సహా పెకిలించాలి. ఊరికే ఆకులు కోస్తే, కొమ్మలు నరికేస్తే లోపల వేరు ఉన్నంతసేపు వర్షాకాలం వచ్చేటప్పటికి మరల మొక్క వచ్చేస్తుంది. దేహము నేను అనే ప్రధాన తలంపును వేరుతో సహా ఎవడైతే పెకిలించగలుగుతున్నాడో వాడికి మాత్రమే అది కడసారి జన్మ, వాడు ఆత్మజ్ఞానానికి అర్హుడు.

గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీరు కష్టపడి సాధన చేసుకోండి, మీకు మానవ దేహం వచ్చింది, కాలాన్ని వృధా చేసుకోవద్దు. ఈ దేహం భూమి మీదకు ఏపని నిమిత్తం వచ్చిందో ఆ పని పూర్తి అయిన వెంటనే దేహం రాలిపోతుంది. మీరు ఎలా రాలిపోవాలో చెప్పమంటారా? దోసకాయ బాగా పండాక ఆ తీగనుండి దాని అంతట అదే విడిపోతుంది, ఎవరూ కొయ్యనక్కరలేదు. పండు నాలోనుండి విడిపోయింది అని తీగకు ఏమీ తెలియదు, బాధ అనిపించదు. దోసకాయ తయారయ్యాక తీగలో నుండి ఎంత సహజంగా విడిపోతుందో అంత సహజంగా మనం దేహాభిమానంలో నుండి విడిపోతే జీవన్ముక్తి స్థితిని పొందుతాము. మన బుద్ధిని పక్వం చేసుకొని దేహాభిమానాన్ని తగ్గించుకొంటే దేహం ఉండగానే దేహాభిమానంలో నుండి విడిపోతావు, అప్పుడు శాంతి కలుగుతుంది, ఆనందం కలుగుతుంది, మరణం తాలుక భయం పోతుంది. మనకు దేహం ఉంది, ఇంద్రియాలు ఉన్నాయి, మనస్సు ఉంది. వీటిని మనం జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మనం ఇంద్రియాలను కంట్రోలులో ఉంచుకోకపోతే పతనమయిపోతాము. అందుచేత ఇంద్రియాలను జాగ్రత్తగా నియమించుకోవాలి. మనం ఎవరినీ అసహ్యించుకోకూడదు. కొంతమంది పూజలు చాదస్తంగా చేస్తారు. దాని వలన వారి మనస్సు నిర్మలం అయితే మంచిదే కాని మనం వారిని ఆక్షేపించకూడదు, ఏదో రకంగా వారు బాగుపడటం ముఖ్యం. అందరూ మనలను ప్రేమించరు, కొంతమంది ద్వేషిస్తూ ఉంటారు, ఆ ద్వేషానికి అనేక కారణాలు ఉండవచ్చు, ఆ ద్వేషాన్ని మనం సహించాలి, దాని వలన మనకు అశాంతి రాకుండా చూసుకోవాలి, యిక్కడ వెంకటేశ్వర పెరుమాళ్ళ విగ్రహం స్థాపించారు. ఇక్కడకు వచ్చి

స్వామిని చూసేటప్పటికి నా సాధనతో నిమిత్తం లేకుండా, నా ప్రయత్నంతో సంబంధం లేకుండా నా మనస్సును దొంగతనం చేసారు. నా మనస్సును దొంగతనం చేసి పట్టుకొనిపోతే ఇంక నాకు గొడవ ఏముంది? గొడవలన్నీ మనసులోనే ఉన్నాయి కదా. దానిని ఎవడో దొంగతనము చేసి పట్టుకొనిపోతే పీడ వదిలిపోతుంది. కృష్ణుడు వెన్నపూస తిన్నాడు అంటే ఎవడి మనస్సు అయితే పవిత్రం అయిందో, మృదువుగా అయిందో దానిని భుజిస్తాడు, తస్కరిస్తాడు. అంటే ఎందుకు పనికిరాని మన మనస్సును ఆయన తీసుకొని, ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు.

మనం అన్నీ సంపాదించుకొంటున్నాము కాని భగవంతుడి దయను సంపాదించుకోవటం లేదు. ఈ దేహాన్ని ఇచ్చినవాడు పరమాత్మ. ఈ దేహాన్ని ఎవడైతే ఇచ్చాడో ఆయనను పూజించుకోవటం, ఆయనను స్మరించుకోవటం మానేశాము ఎందుచేతనంటే మన బుద్ధి మంచిదికాదు. పూర్వజన్మలలో మనం ఎంతో కొంత ఉపాసన చేసి ఉంటే, సత్కర్మ చేసి ఉంటే ఈ రోజున మన మనస్సు భగవదభిముఖంగా ప్రయాణం చేసి ఉండేది. అందుచేత ఉపాసన ముఖ్యం. భక్తి కూడా అంత తేలికగా రాదు. మంచి సంస్కారం ఉండాలి, విశ్వాస పాత్రులు అయి ఉండాలి, మంచితలంపులు ఉండాలి, ప్రోపర్ బిహేవియర్ ఉండాలి, ఇవన్నీ ఉంటేగాని భక్తి కలుగదు. సర్వసాధారణంగా మనం ఇంట్లో వారి మీద ఎక్కువ మమకారం పెట్టుకొంటాము. వారిపట్ల మన డ్యూటీ చేయాలి గాని మమకారం పెట్టుకోకూడదు. వారిపట్ల ఎక్కువ అభిమానం పెట్టుకోవటం వలన వారు పెద్దవారు అయిపోరు, వారి దేహానికి ప్రారబ్దం ఉంటుంది, ప్రారబ్దాన్ని బట్టి వారు తయారవుతారు గాని మీరు అభిమానం పెట్టుకోవటం వలన గొప్ప స్థితిలోనికి రారు. అందరికీ కుటుంబాలు ఉన్నాయి. కుటుంబ సభ్యుల పట్ల మన ధర్మం మనం నిర్వర్తించాలి అంతేగాని మమకారం పెట్టుకోకూడదు. మీకు నలుగురు సంతానం ఉంటే అందరూ ఒకేరకంగా ఉండరు. వారికి మీరు దేహాన్ని ఇచ్చారు అంతే, ఆ దేహప్రారబ్దాన్ని బట్టి వారు వెళ్ళిపోతూ ఉంటారు. స్నేహితులతో ఎక్కువ అభిమానం పెట్టుకోవద్దు, విరోధులతో మానసికంగా దూరంగా ఉండండి. వారికి మనం విరోధులు అయి ఉండవచ్చు కాని మనకి వారు విరోధులుగా ఉండనక్కరలేదు. వారు మనతో ఎందుకు విరోధంగా ఉంటున్నారు, వారు మనలను ఎందుకు ద్వేషిస్తున్నారు అని అటు వెళ్ళకండి. మన వరకే మనం చూసుకోవాలి. జ్ఞానం అనేది స్వతంత్రంగా ఉంటుంది. జ్ఞానంలో విరోధులుగాని, స్నేహితులుగాని, కుటుంబసభ్యులుగాని ఎవరూ లేరు,

దాని వైభవం అటువంటిది.

భగవంతుడికంటే మన క్షేమం కోరే వారు ఎవరూ లేరు. వారు మా క్షేమం కోరుతున్నారు, వీరు మా క్షేమం కోరుతున్నారు అంటే ఇవన్నీ అజ్ఞానంతోటి, అహంకారంతోటి కూడిన ప్రేమలే. రామానుజుడు కూడా తిరిగే అతను ఒక అమ్మాయిని ప్రేమించాడు. వాడు రామానుజుడుతో ఏమి చెప్పాడు అంటే నేను మీతో తిరుగుతున్నాను కాని నా మనస్సు ఆ అమ్మాయి దగ్గరికి పోతోంది అని చెప్పాడు. ఎందుకు నీ మనస్సు అలా వెళ్ళిపోతోంది అంటే ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది అని చెప్పాడు. అప్పడు రామానుజుడు వాడిని గుడిలోనికి తీసుకొని వెళ్ళి రంగనాథుని నేత్రద్వయాన్ని వాడికి చూపించి నువ్వు ఇలా నాలుగు రోజులు వచ్చి చూసివెళుతూ ఉండు. రంగనాథుని నేత్రాలకంటే నువ్వు ప్రేమించిన అమ్మాయి అందంగా ఉంటే పెళ్ళి చేసుకొందువుగాని అని చెప్పాడు. అలా నాలుగు రోజులు రంగనాథుని వైభవం చూసేసరికి మానసికంగా ఆ అమ్మాయిని వదిలేసాడు, ఇంక పెళ్ళి లేదు ఏమీలేదు, ఆ తలంపు పోయింది, మారుమనస్సు పొందాడు. ఆ భక్తుడిలో ఉన్న కల్మషాన్ని, ఆ వికారాన్ని అంతా తీసేసాడు, అది రంగనాథుడు చేసిన ఉపకారం. కిరసనాయిలు డబ్బాలో కిరసనాయిలు అంతా తీసేసిన తరువాత కూడా ఆ డబ్బా కిరసనాయిలు వాసన కొడుతూనే ఉంటుంది. అలాగే నీవు ఏవో సాధనలు చేస్తూ పవిత్రంగా ఉన్నప్పటికీ వాసనాక్షయం పూర్తి అయ్యేవరకు నీకు ఆత్మజ్ఞానం సాధ్యంకాదు. నెమ్మది నెమ్మదిగా మనస్సును స్వాధీనం చేసుకొంటూరా. ఇది తొందరపడితే వచ్చేది కాదు. గత జన్మలనుండి వచ్చిన వాసనలు అనేకం ఉంటాయి. వాటి యొక్క వేగాన్ని తట్టుకోవటానికి నీవు చాలాపట్టుదలతో సాధన చేయాలి. దీనికి వైరాగ్యం అవసరం. అసలు వైరాగ్యం లేకుండా మటుకు మనం సక్సెస్ అవ్వలేము. మన మనస్సుకు అంతర్దృష్టి రాకపోవటానికి, మనకు ఆత్మజ్ఞానం రాకపోవటానికి ఎటాచ్‌మెంట్ కారణం. ఈ ఎటాచ్‌మెంట్ పెద్దపాపం.

వైరాగ్యం అనేది చెడ్డది అనుకొంటాము. అది చెడ్డది కాదు. వైరాగ్యం వలన దేహానికి ఆరోగ్యం కలుగుతుంది, మనస్సుకు కొంత విశ్రాంతి కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. బయట ఉన్నదానికి ఆరోగ్యం, లోపల ఉన్నదానికి ఆనందం ఇవి వైరాగ్యం వలన వచ్చే లాభాలు. మనస్సును లోపల ఉంచాలి అని ఉంది కాని అది బయటకు వచ్చేస్తోంది అని చాలామంది అంటారు. నీ మనస్సులో ఉన్న దుమ్ము, నీ మనస్సులో ఉన్న కోరికలు నీకు తెలియటానికి దానిని బయటకు గెంటేసి అప్పడు నువ్వు ఎలాగ ఉన్నావో లోపల ఉండి ఆయన సాక్షిగా

చూస్తూ ఉంటాడు. వాడే పరమాత్మ. ఇది ఒక ట్రైనింగ్ గ్రౌండ్. మనం ట్రైనింగ్ పొందటానికే ఇక్కడికి వచ్చాము. ఇటువంటి తలంపులు వస్తున్నాయి ఏమిటి? చెడ్డ కోరికలు వస్తున్నాయి ఏమిటి అని నీవు అనుకొంటున్నావు కాని భగవంతుడి పాదాలయందు భక్తి కుదిరితే, ఆయన నామాన్ని నిరంతరం స్మరిస్తూ ఉంటే, ఆయన పట్ల గౌరవం కలిగి ఉంటే నీ మనస్సు ఇతర తలంపుల మీద వాలకుండా ఆయననే ఆశ్రయించి ఉంటుంది, అప్పుడు మనస్సు నశిస్తుంది. అయితే భగవంతుడి మీద మనకు ప్రేమ లేదు, భక్తి లేదు. మనం అంతా ఆయనలో నుండే వచ్చాము. మన నిజమైన తండ్రి భగవంతుడే అనే భావన మనకు లేదు. అయ్యో మనకు ఈ దేహాన్ని ఇచ్చాడు, ఆరోగ్యాన్ని ఇచ్చాడు. వయస్సులో ఉన్నప్పుడే, ఆరోగ్యం బాగా ఉన్నప్పుడే ఆయనలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేయాలనే బుద్ధి మనకు రావటం లేదు. ప్రతీ మనిషి కూడా వాడు ఏదో ఊహించుకొంటాడు, వాడు ఏదో కల్పించుకొంటాడు, వాడే వెళ్ళి బంధంలో పడతాడు. ఆ బంధంలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయటం, దానికి సాధన అని పేరు పెట్టటం, జరిగేది ఇది.

నువ్వు నిరంతరం భగవంతుడిని స్మరిస్తూ ఉంటే, విషయచింతన లేకుండా ఆత్మ చింతన చేస్తూ ఉంటే నీ యోగక్షేమాలను ఆయనే చూసుకొంటాడు. నీకు తలకాయపోటు వస్తే తలకాయ తీసేసుకోవు. తలపోటు తగ్గించమని డాక్టరుగారిని అడుగుతావు. అదేవిధంగా మీకు రజోగుణం, తమోగుణం ఎక్కువగా ఉంటే చనిపోనక్కరలేదు, వాటిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయండి. మనలో ఏమైనా గుణాలు ఉంటే వాటిలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయాలిగాని శరీరాన్ని చంపేయనక్కరలేదు. నీలో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకో, ఏ గుణాలు ఉన్నాయో చూసుకో, ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖం అవుతోందో చూసుకో, వాటిలో నుండి నీ మనస్సును మళ్ళించి, ఆ గుణాలకు బలహీనతలకు అన్నింటికి నీ వీపు చూపించాలి, భగవంతుడికి నీ మొఖాన్ని చూపించి భగవంతుడి వైపుకు నడవవయ్యా. భగవంతుడికి మొఖం చూపించాలి, విషయాలకు వీపు చూపించాలి. అప్పుడు భగవంతుడిని పొందటం నీకు సాధ్యమే. వేదంలో ఒక మాట ఉంది. విత్తనం లేకుండా చెట్టు రాదు. చెట్టుకు విత్తనం ఎటువంటిదో, నీ మనస్సుకు లోపల కామం అటువంటిది, కామం అంటే కోరిక. ఆ కామ బీజం నశించకుండా ఎన్ని జన్మలు ఎత్తినా వృక్షం అలాగే ఉంటుంది అంటే మనస్సు అలాగే ఉంటుంది, దానిని నీవు నశింపచేయలేవు. జ్ఞానం సంపాదించుకోవటానికి మనం ప్రయత్నం చేసేటప్పుడు

రేపు, రేపు అనుకొంటాము. వారు సాగనివ్వటం లేదు, ఇంట్లోవారు సాగనివ్వటం లేదు అని ఏదో వంపు చెపుతూ ఉంటాము. సాధన చేసేవారు ఎలా చెయ్యాలో ఇక్కడ చెపుతున్నారు. ఇప్పుడు మనం ఇటుకావ (ఇటుకలు కాల్చే బట్టీ) మీద కూర్చొన్నాము అనుకోండి. దానికి నిప్ప పెట్టారు అనుకోండి. కొంత టైము అక్కడ కూర్చొందాము, రేపు బయటకు వద్దాము ఇలా అనుకోము. ఇటుకావకు నిప్ప పెట్టినవెంటనే తొందరగా అక్కడ నుండి ఉరికేసి బయటకు వచ్చేస్తాము. ఇటుకావ మీద కూర్చొన్నవాడు దానికి నిప్ప పెట్టిన వెంటనే ఎంత తొందరగా అక్కడి నుండి బయట పడాలని చూస్తాడో అలాగ నీ అజ్ఞానంలో నుండి, ఈ బంధంలో నుండి బయటకు రావటానికి అంత వేగంగా, అంత తీవ్రంగా, అంత కట్టుదిట్టంగా ప్రయత్నం చెయ్యాలి అని బుద్ధుడు చెప్పాడు. టైమును పాడుచేసుకోవద్దు, శక్తిని వృధా చేసుకోవద్దు.

బుద్ధుడిలో నేర్చుకోవలసింది ఏమిటి అంటే ఆయనలో ఎక్కడ వ్యక్తిభావన కనబడదు, ఆ వాసన కూడా ఎక్కడా కనబడదు. చలిఅనక, ఎండఅనక, వానఅనక చాలా సంవత్సరాలు తిరిగి జ్ఞానాన్ని బోధించాడు, అంత కరుణామయుడు. నువ్వు ఎంత అజ్ఞానంతో, దుర్వాసనలతో ఉన్నప్పటికీ నిన్ను చెడ్డవాడికింద ఎప్పుడూ చూడలేదు. ఆయన చూపు వలన మనలో ఉన్న అజ్ఞానం అంటుకొనేది. కేవలం ఆయనను దర్శించటం వలన చాలామంది ఆత్మజ్ఞానం పొందారు అని చెపుతారు. బుద్ధుడి కూడా ఆయన చవితి తమ్ముడు ఆనంద్ ఉండేవాడు. మీ శరీరం చనిపోయిన తరువాత ఈ శరీరాన్ని ఏమి చేయమంటారు అని ఆనంద్ బుద్ధుడిని అడుగుతాడు. బుద్ధుడు చెప్పిన మాట నన్ను ఆశ్చర్యచకితుడిని చేసింది. మోస్ట్ ఇంపెర్సనల్ లైఫ్. ప్రతీ గ్రామానికి ఒక స్మశానం ఉంటుంది కదా. ఆ గ్రామంలోని శవాలను ఏ స్మశానంలో అయితే దహనం చేస్తున్నారో ఈ శరీరాన్ని కూడా తీసుకొని వెళ్ళి అక్కడ దహనం చెయ్యి. బుద్ధుడి శరీరాన్ని ఫలానా చోట దహనం చేసారు అని ఈ లోకానికి ఏమీ గుర్తు అక్కరలేదు అని చెప్పాడు. వాడు బుద్ధుడు. తరువాత వచ్చిన రాజులు ఆయన అస్థికల కోసం పేచీలు పడ్డారు. అస్థికలను వాటాలుగా చేసి వారి వారి ప్రాంతాలకు తీసుకొని పోయారు. ఏదో బంగారం కోసం వెళ్ళినట్లు అస్థికలు మాకు కావాలి, మాకు కావాలి అన్నారు అంటే ఆయన దేహం దేవాలయం అయిపోయింది లేకపోతే అస్థికలకోసం అంతమంది పేచీలు ఎందుకు పడతారు. కోడిపిల్లలు గెద్దలను చూస్తే పారిపోతాయి అలాగ పారిపోయే మనుషులం మనం. ఇటువంటి పిరికివారికి, బుద్ధి తక్కువ వారికి బుద్ధుడి యొక్క వైభవం

ఎలా తెలుస్తుంది అన్నారు స్వామీజీ. మనవి చిన్న చిన్న మనస్సులు, మన ఆలోచనలు చాలా కురచగా ఉంటాయి. మానవజాతి మీద ఆయనకు ఉన్న అపూర్వమైన ప్రేమ, ఇంద్రియాతీతమైన ప్రేమ మనలాంటి చిన్నవారికి అర్థంకాదు అని స్వామీజీ చెప్పారు.

కనిపిస్తున్న వస్తుజాలాన్ని ఎలా ఎంజాయ్ చేస్తున్నారో, తినే తినుబండారములను ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అలాగ మౌనాన్ని ఎంజాయ్ చేయటం నేర్చుకోండి, ఏకాంతవాసాన్ని ఎంజాయ్ చేయటం నేర్చుకోండి. ప్రతిరోజు ఒక గంటైనా ఏదో గదిలో కూర్చొని కుటుంబసభ్యులతో సంబంధం లేకుండా ఏకాంతంగా ఉంటే అప్పుడు మన మనస్సులో ఏముందో మనకు తెలుస్తుంది, మనలో ఉన్న బలహీనతలు మనకు తెలుస్తాయి. ముందు ఆ బలహీనతలు మనకు తెలిసాక అందులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయవచ్చు. జ్ఞానం అంటే అది పైనుండి పోసేది కాదు లోపలనుండి ఊరేది. ఈశ్వరుడి పాదాలయందు నీకు భక్తి ఉంటే, ఉపాసన ఉంటే, తపన ఉంటే జ్ఞానం లోపల నుండి ఊరుతుంది. ఎక్కడైతే జ్ఞానం ఉందో, ఎక్కడైతే ఒక మనిషిలో వైభవం ఉందో అది అంతా నా విభూతి, నా ప్రసాదమే అన్నాడు పరమాత్మ. ఎవరికైనా జ్ఞానం కలిగింది అనుకోండి అంది అంతా ఆయన అనుగ్రహమే. ఆయన అనుగ్రహం లేకుండా వాడికి ఆ శక్తి కలుగనే కలుగదు. నిష్కామకర్మ చేస్తూ ఉంటే ఆయన అనుగ్రహం కలుగుతుంది. ఆయన అనుగ్రహం కలిగాక ఆయన పట్ల భక్తి కలుగుతుంది, ఆ భక్తిలో నుండి జ్ఞానం ఊరుతుంది. భక్తి జ్ఞానానికి తల్లి, భక్తి లేకుండా జ్ఞానం రాదు. భగవాన్‌ను ఒక భక్తుడు అడుగుతున్నాడు. మీరు ఏదో మనస్సు అంటున్నారు, అహంకారం అంటున్నారు, నకిలీ నేను అంటున్నారు, దానిని పోగొట్టుకోవాలి అంటున్నారు. మీరు నాకు భక్తిని ప్రసాదించండి. మీరిచ్చే భక్తిలో ఈ మనస్సు శేషం లేకుండా కాలిపోవాలి. ఆ మాత్రం భక్తిని ప్రసాదించండి అంతకంటే అదనంగా వద్దు అంటున్నాడు. ఆ మాత్రం భక్తి ఇస్తే చాలు అంటే దాని అర్థం పూర్తిగా ఇచ్చేసినట్లే కదా. మనస్సు శేషం లేకుండా నశిస్తే ఇంక ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం, అదే ఆత్మ.

పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే బతుకు. ఆయన నీకు గోచరం కాకపోవచ్చు, అది వేరే విషయం. ఎందుచేతనంటే అతీంద్రియస్థితి పొందినవాడికి కాని ఆయన గోచరించడు. మనస్సుకు పరిమితమై జీవించేవాడికి, దేహానికి పరిమితమై జీవించేవాడికి, ఇంద్రియాలకు పరిమితమై జీవించేవాడికి ఎవడికీ భగవంతుని సాక్షాత్కారం కాదు. అందుచేత నీవు నమ్మిన, నమ్మకపోయిన ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు.

అయితే ఆయన ఉన్నాడు అని చెపితే సరిపోదు. ఆయన పట్ల నీకు ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి. ఆయన పట్ల విశ్వాసం కలిగి ఉంటే, పరిపూర్ణమైన భక్తి కలిగి ఉంటే ఆయన పాదాలను ఆశ్రయిస్తే మనకు మాయ దారి ఇస్తుంది, అప్పడు పరమేశ్వరుడు మనకు గోచరిస్తాడు. చేపలు పట్టేవాడు వల వేస్తాడు అనుకోండి. వాడి పాదాల దగ్గర ఉన్న చేపలు ఆ వలలో పడవు, వాడికి దూరంగా ఉన్న చేపలే ఆ వలలో పడతాయి. అలాగ ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే ఈశ్వరుడి మాయలో నీవు పడవు. ఇవి అన్నీ మీరు వింటే సరిపోదు, వీటిని ఇంటికి వెళ్ళి మననం చేయాలి. భక్తి అంటే చాలా తేలిక అని చాలామంది అనుకొంటున్నారు, భక్తి కూడా అంత తేలికగా రాదు. పూర్వ పుణ్యం లేకపోతే రంపం పెట్టి కోసినా వాడికి భక్తి రాదు. పూర్వ పుణ్యం ఉండాలి, భగవంతుడి దయ అనే కెరటం ఆయన పాదాల దగ్గరకు మనలను గెంటుకొని రావాలి కాని మన సాధనల వలన అక్కడికి మనం చేరుకోలేము, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడని విశ్వాసం పెట్టుకొని, భక్తిని సంపాదించుకొని, ఆయన పాదాలను ఆశ్రయిస్తే ఈ ప్రకృతి గుణాల నుండి, మాయలోనుండి బయటకు వచ్చి మనం తరించే అవకాశం ఉంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-11-2007, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సృష్టి అంతా వాసుదేవస్వరూపమే అని తెలిసినవాడికి పునర్జన్మ లేదు అని పరమాత్మ చెప్పాడు. ఈ సృష్టి అంతా కూడా వాసుదేవస్వరూపమే అని నోటితో చిలుకపలుకులు పలకటం కాదు, ఇదంతా వాసుదేవ స్వరూపమే అని గుర్తించినవాడికి పునర్జన్మ లేదు, మరి ఆ జన్మ ఎప్పడు వస్తుందో చెప్పలేము. మహావిష్ణువును గాని, మహాదేవుడినిగాని మనం ఉపాసన చెయ్యాలి. అంటే ఆ నామాన్ని స్మరించటం, ఆ రూపాన్ని ధ్యానం చేయటం దానినే ఉపాసన అంటారు. ధ్యానం వలన మనకు ఏకాగ్రత వస్తుంది. లోపల అంతఃకరణ శుద్ధిఉంటేగాని భగవాన్ మాటలు అర్థం చేసుకోవటం కష్టం లేకపోతే తిరకాసు వచ్చేస్తుంది. కర్మసిద్ధాంతం నిజమే అంటారు. మనం పుణ్యం చేస్తే పుణ్యఫలం సుఖం, పాపం చేస్తే పాపఫలం దుఃఖం, ఇవి అనుభవిస్తే బయటకు పోతాయి. భగవాన్ ఏమి చెప్పారు అంటే మీకు పరిస్థితులు బాగున్నాయి అనుకోండి పొంగిపోవద్దు, మీరు అనుకొన్న పనులు అవ్వటంలేదు అనుకోండి కుంగిపోవద్దు. మీరు గ్రహించవలసింది ఏమిటి